

# మనస్విని

వి. ప్రభావతి

వీధివైపు గది కిటికీ దగ్గర కూర్చుని ఆత్రుతగా ఎదురుచూస్తోంది రాజ్యలక్ష్మి....ఎంత దాచుకుందామనుకున్నా మనస్సులో దాగని ఆరాటం, కళ్ళల్లో భయం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

''అబ్బ! ఎంతసేపని ఈ రేడియో వింటూ కూర్చోటం, చెవులు హెూరెత్తి పోతున్నాయి. ఆరు గంటలనుంచీ ఎదురు చూస్తున్నాను. ఈ దొరగారికి ఇంకా ఇల్లు జ్ఞాపకం రాలేదు కాబోలు,'' అని విసుక్కుంటూ లేచి, రేడియో వాల్యూమ్ తగ్గించి, కుర్చీ కిటికీకి మరింత దగ్గరగా లాక్కుని కూర్చుంది రాజ్యం....

ఎంత ప్రయత్నించినా మనస్సు కుదుట పడటంలేదు....ఆలోచనలు ముసురుకు వస్తున్నాయి. ఎంతసేపని ఇలా నిరీక్షిస్తూ కూర్చోడం! ఆమాట అంటే "నువ్వు భోజనంచేసి హాయిగా పడుకోరాదూ!'' అని సమాధానం. బొత్తిగా జాలిలేదు. ఎంత నిర్లక్ష్యమో!....ఆ రోజూ అలాగే ఏదో అర్జంటు పనుందని తనని భోజనం చేసెయ్యమని అతను భోజనం చెయ్యకుండా వెళ్ళిపోయాడు. అలా అయితే తనూ భోజనం మానేస్తానన్నది—ఎంత కోపం తెచ్చుకున్నాడు! ఎంత చిరాకు పడ్డాడు! "ఏమిటలా పర్సిక్యూషన్ ప్రారంభిస్తావు? నా కోసం అవతల నలుగురు స్నేహితులు కనిపెట్టుకు ఉంటారు. వాళ్ళతో తప్పకుండా వస్తానని చెప్పాను. అర్జంట్‌గా వెళ్ళాలి. ఏమిటా పట్టుదలలూ పంతాలూను. లెటజ్ బిహేవ్ లైక్ ఎడల్ట్స్'' అంటూ వెళ్ళిపోయాడు.

అతని కోపం చూసి తనకు నవ్వొచ్చింది. తరవాత జాలేసింది.

"ఈయనగారికి త్వరగా వృద్ధాప్యం వచ్చేస్తోంది కాబోలు. పర్‌హేప్స్ హి ఈజ్ ఫాస్ట్ బికమింగ్ ఓల్డ్,'' అనిపించింది. లేకపోతే ఏమిటా చిరాకు, ఏమిటా సీరియస్‌నెస్! భూభారమంతా తనే మోస్తున్నట్టూ ఆకాశం విరిగి తన నెత్తిమీద పడుతున్నట్టూ ఫిలాసఫర్‌లా పోజులు పెట్టి మాట్లాడతాడు ఒక్కొక్కప్పుడు....

* * *

పెళ్ళి అయి కాపురంపెట్టి రెండు సంవత్సరాలయింది. ఇప్పటికీ సంసారంలో ఏ విషయమూ తనకు పట్టనట్టు అలా గాలికి తిరుగుతాడు. మొన్న ఊరికి వెళ్ళినప్పుడు—అప్పుడూ అలాగే—తను అక్కడ ఎలా ఉన్నాడో ఏమిటో ఒక్క ఉత్తరమైనా రాయకూడదూ! ఊహుం అంతమాత్రం పివ్రిలియా? పైగా ఎందుకు రాయలేపంటే—అక్కడ వాతావరణం ఏమీ బాగా లేదంటాడు. ఆ ఊరి ఉష్ణోగ్రత నూట పదిహేడు డిగ్రీలలో ఉదంటాడు—''తాడి చెట్టెక్కినవాడి'' సమాధానంలా....

అయినా అతని తప్పేముంది! చిన్నప్పటి నుంచీ అలా గాలికి పెరిగాడు - పాపం! చిన్నతనంలోనే తల్లిదండ్రుల్ని కోల్పోయాడు. అన్నా వదినా ఇతన్ని అదుపులో పెట్టటానికి ప్రయత్నించారు. అన్నగారి నిర్దాక్షిణ్యం, వదినగారి ఔదాసీన్యం అన్నీ చవి చూశాడు .... ఇతని అభిరుచులూ అభిప్రాయాలూ వాళ్లకి నచ్చేవి కావు. వాళ్ల అభిప్రాయాలూ అలవాట్లూ ఇతనికి సరిపడేవి కావు. చిన్నప్పటినుంచీ ఇతనిదొక విచిత్రమైన ప్రకృతి. ఆ ఇంట్లో అందరికీ నచ్చిన విష

కథానిక

యాలు ఇతని కెందుకో నచ్చేవి కావు.... మొత్తంమీద ఆ వాతావరణానికి అలవాటు పడటం రామానికి శక్తికి మించిన పని అయింది. చివరికి విసుగెత్తి ఇంట్లోంచి పారిపోయాడు. మళ్ళీ నాన్న ఎంతో ప్రయత్నించి తీసుకొచ్చి కాలేజీలో చేర్పించి చదువు చెప్పించాడు....ఏమిటో అతనిమీద అతనికే చిరాకు. క్రమంగా గుండె కరుడు కట్టిపోయింది.... ఎలాగో ఆ చదువు మాత్రం అబ్బింది .... నిజానికి బంధువు లెవరితోనూ అతనికి గాఢమైన అనుబంధాలు లేవు. గాఢమైన ప్రేమ ఆదరణ వాటి ప్రభావం ఎలా ఉంటాయో అతనికి నిజంగా తెలియవు. ఒక విధంగా ఆలోచిస్తే అతనిది కొడిగట్టిన గుండె. అందుకే నాన్న ఎప్పుడూ ఈ బావని గురించే జాలిపడుతూ ఉండేవాడు—"నీ చదువైపోతే నిన్ను వాడికి ముడి పెట్టేస్తానే రాజీ! అప్పటికైనా వాడి జీవితం ఒక కొలిక్కి వస్తుందేమో! వాడు జీవితంలో చిన్నతనంనుంచీ ఒంటరివాడే—పాపం!"అని కళ్ల నీళ్ళు పెట్టుకునే వాడు నాన్న.

బావ అంటే మిగతా బంధువులందరికీ ఎందుకో ఒక చులకన భావం....చిన్నప్పుడు తనూ అతన్ని అలాగే చూసేది. ఎప్పుడైనా అతను సెలవులకివస్తే అతన్ని తెగఏడిపించేది. అతను ఊరికే ఉడుక్కునేవాడు. అతను ఉడుక్కున్న కొద్దీ మరీ సరదాగా ఏడిపించేది....ఆ రోజుల్లో తనకు ఎంత గర్వంగా ఉండేది!.... తను ఏకాంతంగా ఉన్న సమయాల్లో దగ్గరగా కూర్చుని తనని పలకరించాలనీ తనతో మాట్లాడాలనీ అతను ఎంతగానో ప్రయత్నించేవాడు. కాని అతనికి ఏమాత్రం అందుబాటులో ఉండకూడదని తన పట్టుదల. తను అతన్ని తప్పుకు తిరిగేది. దగ్గరకివస్తే తృణీకరించేది. అసలు అందుకే ఇప్పుడు అతనికి తనమీద అంతకోపం! మరొక స్థితిలో అయితే అసలు తనని పెళ్ళి చేసుకోకుండా దూరదూరంగా ఉండి అతనూ తనని ఏడిపించేవాడేమో! కాని అతని చదువు కోసం నాన్నే డబ్బు ఖర్చుపెట్టడం, ఆదరణగా చూడటం, అప్పుడప్పుడూ అజామాయిషీ కనుక్కుంటూండటంవల్ల, నాన్నంటే బావకి అమితమైన గౌరవం. ఆయనమీదఉన్న గౌరవంకొద్దీ తనని పెళ్ళిచేసుకోడానికి ఒప్పుకున్నాడేమో! లేకపోతే తను పెంకెపిల్ల అనీ, అతనంటే నిర్లక్ష్యమనీ తెలిసికూడా తననే ఎందుకు పెళ్ళి చేసుకుంటాడు!—ఒకవేళ ఇద్దరూ పెంకెవాళ్ళే కనుక తీరికూర్చుని సరదాగా పోట్లాడుకుంటూ ఉండచ్చుననే తనని కట్టుకున్నాడేమో! ఎలాగా కట్టుకున్నాడుగా — కులాసాగా ఉండరాదూ! ఎప్పుడు చూసినా చూపులు ఆకాశంలోనూ కాళ్లు బురదలోనూ!

బావ తనని కొత్తగా కాపురానికి తీసుకు వచ్చేటప్పుడు, తాతయ్యకూడా అదే అన్నాడు, "ఏమే రాజీ! మొగుడి దగ్గరకి వెళ్ళిపోతున్నావటగా! ఇక మా అందర్నీ మరిచిపోతావు కాబోలు....ఉత్తరాలైనా రాస్తూ ఉంటావా?" అన్నాడు ఛలోక్తిగా. బండీ ఎక్కబోతూ తాను తాతయ్యా పాదాలకి నమస్కారం చేసింది. "దీర్ఘ సుమంగళీ భవ" అని దీవించి తనని దగ్గరకి తీసుకుని చాటుకి తీసుకువెళ్ళి చెప్పాడు తాతయ్య, "చూడు రాజీ! వాడు ఇన్నాళ్ళూ దారం తెగిన గాలి పటంలా తిరిగాడు....వాణ్ణి ఎలా దారిలోకి తెచ్చుకుంటావో మరి!....అంతకంటే నేను నీకు చెప్పేదేముంది? మీరిద్దరూ నాకు కావలసినవాళ్ళే...." అన్నాడు తాతయ్య. ఆ మాటలు అంటూంటే ఆయన కంఠం ఆర్ద్రమయింది. "ఫరవాలేదు తాతయ్యా...." అని మాత్రం అనగలిగింది తను .... వాళ్లందర్నీ వదిలి వస్తూంటే తనకి కళ్ళనీళ్ళొచ్చాయి. "ఛ! తప్పమ్మా! అలా కంటతడి పెట్టకూడదు. నీ బావ దగ్గరకేగా వెడుతున్నావు. చిన్నప్పుడు నీతో ఆడుతూ పాడుతూ కలిసి తిరిగిన బావేగా! నువ్వు మళ్ళీ ఎప్పుడు రావాలనుకుంటే అప్పుడే వస్తూ ఉండవచ్చు, వెడుతూ ఉండవచ్చు. నువ్వు కంటతడి పెట్టకూడదమ్మా," అని ఓదార్చాడు తాతయ్య. అలా చెప్పాడే కాని, ఆ సమయంలో ఆయనకి కళ్ళ నీళ్ళొచ్చాయి. తనకి కనబడకుండా పక్కకి తిరిగి కళ్ళు తుడుచుకున్నాడు. ఆ రోజున వదిన లిద్దరూ బండిదగ్గరకి వచ్చి ఎంత వేళాకోళం చేశారు!

పెద్దవదిన మరీని—దగ్గరకివచ్చి కితకితలుపెట్టి నవ్వించేసింది. బుగ్గలు రెండూ గట్టిగా గిల్లి "పిల్లా! మా తమ్ముడు జాగ్రత్త సుమీ! అతను ఒఠి అమాయకుడు! నీ చేతుల్లో నలిగి పోగలడు....'' అంది. సిగ్గుల బరిణ అయి తలవంచుకుంది తను....అమ్మ' చిన్నవదిన అన్నయ్యలిద్దరూ తను బండి ఎక్కగానే కళ్ళ నీళ్లు పెట్టుకున్నారు....నాన్న సరేసరి—అసలే జాలి గుండెవాడు—రైలు కదలబోతూంటే దగ్గరకి వచ్చి "వెడుతున్నావా తల్లీ?'' అని తన చెయ్యి ఆయన చేతుల్లోకి తీసుకుని ఆవురు మన్నాడు. పాపం! నాన్న ఎలా ఉంటున్నాడో బావ కొంచెం చిరాకుపడితే చాలు, ఇక వాళ్లంతా జ్ఞాపకం వస్తారు. బాధగా ఉంటుంది. వెంటనే వాళ్ళందర్నీ చూడాలనిపిస్తుంది. ఇక ఆ రోజంతా దిగులుగా ఉంటుంది....

కాని, తాతయ్య అన్నట్టు వాళ్ళందర్నీ మర పించి మైమరపించేశక్తి బావలోఉంది. వాళ్లందరితోకంటే ఎక్కువ అనుబంధం తనకి అతనితో ఏర్పడింది.బావకి తను తప్ప ఇంకెవరున్నారు? ఇంకా తనకయితే వెనకాల బోలెడంత బలగం. అమ్మా నాన్నా అన్నయ్యలూ వదినలూ అందర్నీ మించినవాడు తాతయ్య. తనకేకాస్త కష్టంవొచ్చినా వీళ్ళంతా బాధపడతారు. తన మనస్సు నొచ్చుకుంటుందేమోనని వీళ్ళంతా భయపడతారు. అలా చూసేవాళ్ళు అతని కెవ రున్నారు? అతనికి కోపంవచ్చినా చిరాకుపడినా మనస్సునొచ్చినా అతన్ని అతనే ఓదార్చు కోవాలి. అతనికి అతనే ధైర్యం చెప్పుకోవాలి. ఇన్నాళ్ళూ అతనికి అలాగేగా గడిచింది. అత నంటే అతని బంధువుల కెవరికీ నిజమైన సాను భూతిలేదు—అందుకేనేమో అతనికి మనుషు లంటే అంత చిరాకు....ఒక్కొక్కసారి చిన్న చిన్న విషయాలకికూడా చిరాకుపడి కోపం తెచ్చుకుంటాడు—రాత్రి పదిగంటల వేళ "పింగళి సూరన్న 'కలభాషిణి' అంటూ ప్రారంభించాడు—తనకి ఒళ్లుమండింది....''అర్ధ రాత్రి దాటింది...ఇప్పుడుకూడా ఆ 'కలభాషిణి' గొడవేనా....ఇంకేమైనా మాట్లాడ కూడదూ'' అన్నది విసుగ్గా. ఆ మాటకి కోపంవచ్చి రాత్రి నుంచీ మూతి ముడుచుకున్నాడు....లేకపోతే యేమిటి! ఎప్పుడుచూసినా శరత్ "రాజ్యలక్ష్మి," పింగళి సూరన్న "కలభాషిణీ,'' విశ్వనాథ వారి "అరుంధతీ,'' అంటూ ఇవే కబుర్లు.... తన జీవిత భాగస్వామినిగా సాక్షాత్తూ తన ధర్మ పత్నిగా తన హృదయ సామ్రాజ్యానికి సర్వాధి కారిణిగా ఉన్న రాజ్యలక్ష్మిని—తనని మెచ్చు కోడు — "శ్రీకాంతలో రాజ్యలక్ష్మి చాలా గొప్పది,'' అంటాడు—అందుకే తనకి అంత కోపం. ఎంతసేపూ పుస్తకాలలో పాత్రల్ని చూసి మురుసుకోవటమే; ఎప్పుడూ పగటికలలతో కాలం గడపటమే....అతని నోటివెంట ఏ స్త్రీ పేరు వినిపించినా తనకి జెలసీ వస్తుంది. అదీ అసలు రహస్యం!

కాపురానికి వచ్చిన కొత్తలో ఒక రోజు సాయంకాలం ఇద్దరూ కలిసి వాళ్ల అక్కయ్య గారింటికి వెళ్లారు. వెళ్లగానే ఆవిడగారు "ఒరేయి రామా! పనస తొనలు తింటావురా?'' అన్నది- ఆపేక్ష అంతా తమ్ముడి మీదే ఒలకబోస్తు న్నట్టు. అనటం ఆలస్యం—ఈయనగారు వెళ్ళి ఆవిడ పక్కన కూర్చుని తొనలు తినటం మొదలెట్టాడు...,తనకి చాలా కోపంవచ్చింది. బతికి లేదుగానీ ఉంటే అతను వాళ్ల అమ్మ పక్కన కూర్చున్నా తనకి కోపం వచ్చేదేమో! ఎందుకోగానీ ఏ ఆడదైనా అతని పేరు తలిస్తే- కాదు-అతను ఏ ఆడదాని పేరైనా తలిస్తే తనకి మహచెడ్డకోపం..తను కాపురానికి రాగానే సరోజిని చూడటానికి వచ్చి "నువ్వు అదృష్ట వంతురాలివి రాజ్యం! మీ బావ చాలా గొప్ప వాడు. అతని భార్యగా నువ్వు చాలా సుఖపడ తావు,'' అన్నది. అతను గొప్పవాడనే సంగతి తనకి ఒకళ్లు చెప్పేదేమిటీ, తనకి తెలియదూ? అతను గొప్పవాడు కాబట్టే అతన్ని తను పెళ్ళి చేసుకుంది. అసలు సరోజ మనస్సులో ఉద్దేశం వేరు. ఆ "అదృష్టం'' కాస్తా తనకి దక్కలేదని బాధ; 'రాజ్యానికి దక్కిందే' అని ఈర్ష్య.... అతనూ సరోజా క్లాస్‌మేట్స్‌ట కూడాను. ఆ సంగతి తనకి తరవాత తెలిసింది. ఇన్నాళ్ళూ ఆ విషయం ఎందుకు చెప్పలేదని అడిగినందుకు ఆ రోజూ అతను మూతి బిడాయించేశాడు....

అతను అలా చికాకు పడతాడు, తనూ ఎంతో తెగింపుగా ఉంటుంది. అటువంటి సమయాల్లోనే అతని వంక చూస్తే తనకి విపరీతమైన జాలేస్తుంది. ఆ సమయంలో తన కళ్ళకి అతనొక శిశువులా కనిపిస్తాడు. అతనికి తల్లీ తండ్రీ, తోడూ నీడా అన్నీ తనే కదా అనిపిస్తుంది. మరుక్షణంలో అతనిమీద ఉన్న కోపమంతా పోతుంది. అతన్ని దగ్గరకి తీసుకుని అతనిలో ఉన్న చిరాకుని బాధల్ని అతని ఒంటరితనాన్ని పోగొట్టి నవ్వించాలనిపిస్తుంది. అతనిలో ఏదో అగ్ని, ఏదో తీరని అశాంతి ప్రజ్వరిల్లింది. దానిని చల్లార్చి అతనిని శాంతింపచేయగల శక్తి తనలో ఉంది. ఆ బాధ్యత తనదేగా—అదేగా ఆ రోజున తాతయ్య తనతో చెప్పాడు!

మొదటిసారి ఇద్దరూ కలుసుకున్న రోజున అతను తనని గాఢంగా హృదయానికి హత్తుకుని—"ప్రపంచంలో ఎక్కడా దొరకని శాంతీ తృప్తీ అన్నీ నాకు నీలోనే దొరికాయి రాజ్యం!" అన్నాడు...తరవాత ఒకనాటిరాత్రి, ఆ తొలిరోజు జ్ఞాపకం తెచ్చుకుని—"ఎవరో కవి అన్నట్టు—

నీవు తొలినాడు నా మనో నిభృత వీధి
జన్మ జన్మాంతర పు
నీత సంస్క్రియా ప్ర
ణీత ఘానంద శకలము నీ మనోజ
లేజ సంస్పర్శ కలిమి వెల్గించినావు-"

అన్నాడు....

* * *

"ఇదువరై ఇసైత్తట్టు సంగీదం కేట్టీరి ఘళ్. మరిపడియుం నాళ్‌కి కాలిల ఆరు అంబత్తంజికి ఆరంబమాహుం .... ఇప్పళుదు మణి పత్తు ముప్పత్తి ఒంద్రు. జైహింద్. జయభారత్...." రేడియో టైమ్ సిగ్నల్ విని ఉలిక్కిపడింది రాజ్యం. చప్పునలేచి రేడియో ఆఫ్‌చేసి కంగారు పడుతూవచ్చి మళ్లీ కిటికీదగ్గర నించుంది.... అబ్బ! ఎంత రాత్రయిందో! బయటికి వెడితే ఇహ ఈయనగారికి ఇంటి సంగతే జ్ఞాపకముండదు కాబోలు! ఎంత నిర్లక్ష్యమో మనిషికి! ఇంతసేపు ఇల్లుపట్టకుండా తిరుగుతూంటే తను ఒంటరిగా ఎలా ఉండగలదనుకున్నాడో! మళ్ళీ తనంటే అతనికి అనురాగం లేకపోనూ లేదు-ఒకసారి వాళ్ళ అక్కయ్యగారింటికి వెళ్ళి నాలుగురోజులుండివస్తే ఇంటికి రాగానే దగ్గరకి వచ్చి అమాంతం కౌగిట్లోకి తీసుకోబోయాడు. "అబ్బ! ఉండు రామూ! ఏమిటది?" అని తను కౌగిలి విడిపించుకుని దూరంగా వెళ్ళిపోయింది. "ఏమిటి రాజ్యం! అలా తప్పించుకు వెళ్ళిపోతావేం! మనం ఇంత దగ్గరగా ఉండి ఎన్ని యుగాలయింది?" అని బిక్కమొహంవేశాడు. అప్పుడు చూడాలి అబ్బాయిగారి మొహం! "ఎన్నో యుగాలు కాలేదులే; నాలుగు రోజులే అయింది" అన్నది తను, అతన్ని ఇంకా కాస్త ఉడికిలించాలని. "కాదు రాజ్యం! నా ప్రాణానికి నాలుగు యుగాలయినట్టుంది" అన్నాడు....

"ఏమిటండీ రాణీగారు పరాకు చిత్తగిస్తున్నారు! ఇంట్లోకి మనిషి వచ్చిందికూడా తెలియటంలేదే! తమరు కాస్త వీడి సంగతిచూడాలి మరి..." అంటూనే చల్లని స్పర్శ చెక్కిళ్లకి తగలటంతో, ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూసింది రాజ్యం.

"అరె! ఎంతసేపయిందీ? .... మెట్లగది తలుపు తీసేఉందా?" అన్నది ఆశ్చర్యంతో.

"అబ్బే లేదు; వేసేఉంది. నేనే దొంగతనంగా గడియ తీసుకుని లోపల దూరాను.... దొంగలు ప్రవేశించినా అంతటి దానివేగా?" అన్నాడు రామం కొంటెగా.

ఇంతలో రాజ్యం ముఖంలో రంగులు మార్చుకుంది. అరె! ఇదేమిటీ! ఇంతవరకూ ఇతనిమీద పెంచుకున్న కోపమంతా ఏమైందీ! ఇంట్లోకి వచ్చాక చాలాసేపటివరకూ అతనితో మాట్లాడకూడదనుకుంది తను....అసలు మెట్లుగది తలుపుతీసి ఉందనే సంగతే జ్ఞాపకం లేదు; అతను తలుపు కొడతాడని తను ఇంకా ఎదురుచూస్తూనే ఉంది. ఎంత పిలిచినా తలుపు తియ్యకుండా కాస్సేపు ఏడిపించాలనుకుంది-చివరికి తను జాలిపడి తలుపు తీస్తుంది. అతను లోపలికి అడుగుపెడుతూనే ఆ చీక

ట్లోనే....ఆ మెట్లమీదే తనని....ఊహుఁ, తను అతనికి అందకుండా దూరంగా తోసేసి మాట్లాడకుండా చరచరా పైకి వెళ్ళిపోవాలి. అతను కూడా వస్తాడు....తను అతన్ని తప్పుకుని తిరుగుతుంది. అతను పసిపాపలా బిక్క మొహం వేస్తాడు. తను అతనివంక చురచురా చూస్తుంది. అప్పుడు అతను దగ్గిరకి వచ్చి బ్రతిమాలుతాడు. తను బింకం చూపిస్తుంది. ప్రాధేయపడతాడు. తను కోపంగా చూస్తుంది. అతను దగ్గరకివచ్చి "నన్ను క్షమించలేవా రాజ్యం?" అంటూ రాజీకి దిగుతాడు. సంధి పత్రాలు వ్రాసుకుంటారు. తను షరతులు పెడుతుంది. అతను అన్నిటికీ ఒప్పుకుంటాడు. సరే....కాని....ఇప్పుడు కథంతా తారుమారైందే, ఇంకేం చెయ్యటం!....

అయినా రాజ్యం చప్పున అతని చేతుల్లోంచి తప్పించుకుని దూరంగా నించుని ముఖం పక్కకి తిప్పుకుని కోపం అభినయిస్తూ అన్నది, "నిజమే! ఎలాగూ దొంగ దొరికాడు కనుక శిక్ష వెయ్యక తప్పదు."

"నేర మేమిటో తెలుపకనే శిక్ష విధించటం తమబోటి ధర్మ తల్లులకి తగదనుకుంటాను దేవీ!" అన్నాడు రామం, నేరస్తుడిలా చేతులు కట్టుకుని తలవంచుకుని, అతి వినయంగా ఆమె ముందు నిలబడి.

"ఛీ! ఛో బావా! అచ్చం నాటకంలో వేషం లాగా అన్నావు," అని ఫక్కున నవ్వేసి, వెంటనే నాలిక్కరుచుకుంది—"అరెరే! నాకింత మతిమరుపేమిటి!" అనుకుంటూ మళ్ళీ ముఖాని కింత కోపం రంగు రాచుకుని గంభీరమైన కంఠంతో అన్నది....

"ఆడదాన్ని ఒంటరిగా ఇంట్లో వదిలేసి అర్ధ రాత్రి దాకా హాయిగా ఊరంతా తిరిగి తిరిగి చివరికి దొంగతనంగా ఇంట్లో ప్రవేశించటం మీబోటి—"

"ఒద్దు రాజ్యం ఒద్దు. ఇంక కోప్పడకు మరి....స్నేహితులిద్దరు కనబడి 'రాను మొర్రో' అంటున్నా వినకుండా సినిమాకి లాక్కెడితే వెళ్ళాను. ఈ ఒక్కసారీ యీ దీనుడి తప్పు మన్నిస్తే .... ఏదీ ఒక్కసారి...." అంటూ రామం ఆమెను బలవంతంగా కౌగిట్లో బంధించేశాడు.

"ఎన్నితప్పులయినా దీనితోసరి. అంతేగా?" అన్నది రాజ్యం అతని కౌగిలిలో కరిగిపోతూ.... ఆమె హృదయంలో ఆనందపుటలలు చెలరేగి ఉవ్వెత్తుగా లేచి ఆమెను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి....వాటి లోతులు అందుకోవాలని, మానవ జీవితానందపుటవధులు వెతికి పట్టుకోవాలని ప్రయత్నం....ఊఁ హుఁ, ఆమె కాళ్ళు తేలిపోతున్నాయి; లోతు అందటం లేదు....ఆ తరంగాల తాకిడికి ఆమె చకితురాలై ఒక్కసారి అతన్ని గాఢంగా హృదయానికి హత్తుకుంది. ఆమె శరీరమంతటా అతను ఆవరించాడు. ఆమె అతనిలో ఒదిగిపోయింది. శరీరమంతా తేలికై ఎక్కడికో తేలిపోతోంది. ప్రపంచమంతా ఎటో కదిలిపోతోంది....కొంత సేపటికి రాజ్యం మత్తుగా కళ్ళుతెరిచింది....

"అవును రాజ్యం. నువ్వుకూడా నామీద కోపం తెచ్చుకుంటే నే నేమై పోవాలి చెప్పమరీ? నువ్వు నన్నెప్పుడూ కోప్పడకూడదు. తెలిసిందా?" అన్నాడు రామం, తనతలను ఆమె గుండెలకి ఆన్చి.

"లేదు రామూ! అది నాశక్తికి మించిన పని. ఆ సంగతి నీకుమాత్రం తెలియదా?" అన్నది రాజ్యం, అతనితల నిమురుతూ....తృప్తిగా ఆమె గుండెల్లో తలదాచుకున్నాడు రామం. ★

---

భార్యాభర్తల మధ్య రాజకీయ విభేదాలను గురించి చర్చిస్తూ కాంగ్రెసువాది అయిన ఒక నూతన వధువుతో ఓ పెద్దమనిషి అన్నాడు—'అయితే నీ సోషలిస్టు భర్తని ఎలా సరిదిద్దుతున్నావు?'

'అబ్బే అదొక సమస్యే కాదండీ, ప్రస్తుతం యిద్దరం కలిసి సరికొత్తపార్టీ నొకదాన్ని స్థాపించే హడావిడిలో వున్నాం!' అంది నూతన వధువు.